క్లుప్తంగా

కలెక్టర్‌కు ఫిర్యాదు

మల్లేల(తిరువూరు): మండలంలోని మల్లేల మత్స్యకారుల సొసైటీ నిర్వాహకులు పెద్ద చెరువులో చేపలు పట్టే హక్కును నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని ఆ సొసైటీ సభ్యులు కొందరు బుధవారం జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. చేపలు పట్టే హక్కును సొసైటీ సభ్యుల అంగీకారం లేకుండా విక్రయించిన సొసైటీ అధ్యక్షుడు వంగూరి ఆనందరావుపైచర్యలు తీసుకోవాలని సభ్యులు దార్ల ఏసుపాదం, మురళీకృష్ణ, కేశవులు, ఏసుదాసు కోరారు.

పరీక్షకు 150 మంది హాజరు

తిరువూరు: డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం తిరువూరులో జరిగిన ఏపీ కానిస్టేబుల్ నియామక నమూనా రాత పరీక్షకు 150 మంది అభ్యర్థులు హాజరయ్యారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు ప్రశ్నపత్రం విడుదల చేశారు. డీవైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎస్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో నమూనా పరీక్ష నిర్వహించారు.

నేడు సర్వసభ్య సమావేశం

నూజివీడు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎంపీఎస్ సుందరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యుడు, సంబంధిత అధికారులు హాజరవ్వాలని ఎంపీడీవో కోరారు.

51 మందిపై కేసులు



ఇబ్రహీంపట్నం: మండలం పరిధిలోని గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, గుండాట, పేకాట శిబిరాల నిర్వాహకులు 51 మందిపై కేసులు నమోదు చేశామని సీఐ పి.శ్రీను బుధవారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం, ఈలప్రోలు, మూలపాడు, చిలుకూరు, కొండపల్లి, తుమ్మలపాలెం, లంక గ్రామాల్లో మూడు రోజుల పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని అరెస్ట్ చేశామన్నారు. సంప్రదాయం పేరుతో ఇకపై కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 51 మందిని కోర్టులో హాజరు పరుస్తామని సీఐ వివరించారు.

హుండీ ఆదాయం రూ.24 లక్షలు



నెమలి(గంపలగూడెం): జిల్లాలో విశిష్ట ఆలయమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో భక్తులు హుండీలలోవేసిన కానుకలను బుధవారం లెక్కించారు. గత ఏడాది సెప్టెంబర్ 17 నుంచి జనవరి 18వ తేదీ వరకు భక్తులు స్వామికి హుండీలలో సమర్పించిన కానుకలు రూ.24,55,516 లెక్కింపులో వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ కె.శాంతి తెలిపారు. విజయవాడ కాశీ విశ్వేశ్వరఅన్నపూర్ణ దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్వీ సాంబశివరావు, గన్నవరం ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాస్, పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, సత్యసాయి సేవా సమితి సభ్యులు, స్టేట్ బ్యాంకు సిబ్బంది లెక్కింపు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలక వర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, టీ.వీరప్రసాద్, సంక రాధాకృష్ణ పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి

లబ్బీపేట(విజయవాడతూర్పు): హైరిస్క్ గర్భిణులపై పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని పేర్కొన్నారు. ఆమె బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం అమలు తీరును పరిశీలించారు. అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జుజ్జూరు-1 వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రంగాపురం హెల్త్ క్లినిక్‌లను సందర్శించి ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపులు నిర్వహిస్తున్న తీరును స్వయంగా తెలుసుకున్నారు. గర్భిణులు, హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ప్రసవ సమయంలో సకాలంలో ఆస్పత్రికి చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రవాణాఖర్చులను సైతం ప్రభుత్వమే చెల్లిస్తున్నందున వైద్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్పందన, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ఏపీ టాప్

- తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి
- వావిలాల శివారు రాజుగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



రాజుగూడెంలో లబ్ధిదారుడికి బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

వావిలాల(తిరువూరు): పేదలకు సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని తిరువూరు శాసనసభ్యులు కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. బుధవారం మండలంలోని వావిలాల శివారు రాజుగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాల్లో అన్నివర్గాలకూ ఉపయోగకరమైన పథకాలను ప్రవేశపెట్టిన ప్రభుత్వం వాటిని సక్రమంగా అందించడానికి గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను ప్రవేశపెట్టిందని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనుల నిర్వహణకూ ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ప్రజా సంకల్ప యాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో నూరుశాతం నెరవేర్చారని, ఇంకా వివిధ పథకాలకు దరఖాస్తు చేసి సాంకేతిక కారణాలతో లబ్ధి చేకూరని వారికి ఏడాదికి రెండుసార్లు పునఃసమీక్ష చేసి సొమ్ము మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, రాజుగూడెం పీఏసీఎస్ చైర్ పర్సన్ కొమ్మినేని కిషోర్, ఎంపీటీసీ సభ్యురాలు కంచెపోగు లక్ష్మి, వైఎస్సార్సీపీ నాయకులు రాజవరపు కృష్ణయ్య, కంటిపూడి గోపాలరావు, పూల కోటేశ్వరరావు, మారెళ్ళ వెంకటేశ్వరరావు, గౌర్రాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసిన సీఎం జగన్



ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

- నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- తోటపల్లిలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం

ఆగిరిపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. మండలంలోని తోటపల్లిలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం రాత్రి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలకు నేరుగా అందుతున్నాయా లేదా తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరితగతిన అందించేందుకు గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన వారికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. సీఎం వైస్ జగన్ ఆదేశాల మేరకు ప్రతి గడపకూ తిరుగుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చింతా శ్యామల, వైఎస్సార్ సీపీ నాయకులు బెజవాడ రాంబాబు, బెజవాడ హర్ష, రాజులపాటి శ్రీమన్నారాయణ, తహసీల్దార్ ఉదయ్‌భాస్కరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ జీవితానికి మరియమాత ఆదర్శం

ఆగిరిపల్లి: సమాజంలోని కుటుంబ జీవితానికి మరియమాత ఆదర్శమని వెలగలగూడెం విచారణ గురువు ఫాదర్ దానియేలు అన్నారు. మండలంలోని ఈదర సహాయమాత ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి ఆరో రోజు నవదిన ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ దానియేలు దివ్య పూజాబలిని ఘనంగా నిర్వహించారు. ఈదర విచారణ గురువు అగస్టీన్, సహాయ గురువు ప్రకాశ్, భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఆధార్ సమస్యలను పరిష్కరించుకోండి

జి.కొండూరు: మండలంలో 16 గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలకు ఆధార్ సమస్యలను పరిష్కరించేందుకు గురువారం నుంచి ఆధార్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనూరాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 19, 20వ తేదీల్లో కుంటముక్కల ఎంపీయూపీ పాఠశాలలో, 21న కుంటముక్కల గ్రామ సచివాలయంలో, 23న వెంకటాపురం ఎంపీపీ పాఠశాల, 24న వెంకటాపురం గ్రామ సచివాలయంలో ఆధార్ మేళా జరుగుతుందని తెలిపారు. ఈ ఆధార్ మేళాలో ఆధార్ బయోమెట్రిక్ సమస్యలు, ఫోన్ నంబరు లింకేజీ, ఈకేవైసీ, నూతన ఆధార్‌లు నమోదు వంటి సమస్యలను పరిష్కరించుకోవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి

గంపలగూడెం: మండలంలో ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆధార్ మొబైల్ క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. గురువారం చింతలనర్వ మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాల, గంపలగూడెం సచివాలయం-1లో క్యాంపు నిర్వహిస్తారు. 20వ తేదీన చింతలనర్వ ఎలిమెంటరీ పాఠశాల, గంపలగూడెం-2 సచివాలయాలలోను, 21న గంపలగూడెం-2, దుందిరాలపాడు సచివాలయాల్లో, 23న తోటమూల సరస్వతి విద్యాలయం, దుందిరాలపాడు సచివాలయాల్లో, 24న తునికిపాడు సచివాలయం, తోటమూల సరస్వతి విద్యాలయంలో ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపుల్లో ఆరు సంవత్సరాల పైబడిన పిల్లలకు కొత్త ఆధార్ కార్డుల నమోదు, పెద్దలకు ఆధార్‌కార్డులలో తప్పుల సవరణ అప్డేషన్ చేయించవచ్చన్నారు. పరిసర గ్రామాలవారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని ఎంపీడీఓ కోరారు.

తులాబారం మొక్కుబడి చెల్లింపు



నెమలి(గంపలగూడెం): తనకు ఇటీవల సంతానం కలిగిన నేపథ్యంలో ఒక భక్తుడు నెమలి శ్రీ వేణుగోపాలస్వామికి బుధవారం మొక్కుబడిగా తులాభారం చెల్లించాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన పుచ్చకాయల రంజీత్‌కుమార్, ఉషారాణి దంపతుల కుమార్తె దిల్వనికి చిల్లర నాణెములతో తులాభారం చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ కె.శాంతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా నియామకంపై హైకోర్టు స్టే

తిరువూరు: తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఏ.కొండూరు మండలం కొత్త రేపూడి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా నియామక ప్రక్రియ నిలుపుదల చేయాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించినట్లు సీడీపీవో సత్యవతి తెలిపారు. గతంలో పనిచేసిన ఆయాపై పోలీస్ కేసు నమోదైన నేపథ్యంలో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఆమెను విధుల నుంచి తొలగించి, ఆ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీచేయగా, తొలగించిన ఆయా కోర్టును ఆశ్రయించి స్టే పొందినట్లు సీడీపీవో వివరించారు. ఈ నెల 21న జరిగే కొత్తరేపూడి ఆయా ఎంపిక ప్రక్రియను నిలిపివేసినందున దరఖాస్తు చేసిన అభ్యర్థులు గమనించాలని కోరారు. తిరువూరు సుందరయ్య కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్త, మల్లేల, కొత్తపల్లి, లింగాల సహాయకుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు యథావిధిగా జరుగుతాయని తెలిపారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: వస్తువులు కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాస్ తెలిపారు. మైలవరంలోని ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం డాక్టర్ దాస్ మాట్లాడుతూ వస్తు సేవలు ఉపయోగించుకునే ప్రతి ఒక్కరూ వినియోగదారుడేనని అన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం 1986లో తొలిసారిగా అమలులోకి వచ్చిందని తెలిపారు. కాలానుగుణంగా వినియోగదారుల అవసరాన్ని బట్టి ఈ చట్టంలో లోటుపాట్లు సవరించి 2019 జూలై, 20న కొత్త చట్టం వచ్చిందని తెలిపారు. బంగారం కొనుగోలులో వ్యాపారస్తులు తప్పుడు సమాచారంతో అధికంగా వినియోగదారుని నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నారని వివరించారు. దేశ వ్యాప్తంగా 676 బీఐఎస్ హాల్‌మార్క్ సెంటర్స్ ఉండగా మన రాష్ట్రంలో 60కి పైగా ఉన్నాయన్నారు. నాణ్యతను బట్టి బంగారం ధర ఉంటుందన్నారు. ఆభరణాలు చేసే బంగారం నాణ్యత 22 క్యారెట్లు ఉండాలని, కాని కొంతమంది వ్యాపారులు తక్కువ నాణ్యత కలిగిన బంగారంతో తయారు చేసిన వస్తువులను 22 క్యారెట్లు ధరకు అమ్ముతున్నారన్నారు. బంగారు నగలు తూచే ఎలక్ట్రానిక్ మిషన్‌పై లీగల్ మెట్రాలజీ శాఖ వారి సీల్ ఉందోలేదో గమనించి కొనుగోలు చేయాలని సూచించారు.

సామూహిక సాయి వ్రతాలు



షిర్డిసాయి మందిరంలో సామూహిక సాయివ్రతాల్లో భక్తులు

తిరువూరు: స్థానిక శ్రీషిర్డిసాయి మందిరంలో బుధవారం సామూహిక షిర్డిసాయి వ్రతాలు ఆచరించారు. సాయిబాబాకు నిత్యపూజలు, అభిషేకాదులు నిర్వహించిన అనంతరం అర్చకులు సాయి వ్రతం జరిపారు. పలువురు దంపతులు ఈ వ్రతాలు ఆచరించారు. మందిర కమిటీ అధ్యక్షులు గూడపాటి మాణిక్యాంబ, సురేష్, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సినిమా షూటింగ్ సందడి



సినిమా షూటింగ్ పూజా కార్యక్రమంలో నటులు, డైరెక్టర్, నిర్మాతలు

మైలవరం: మైలవరంలో సినిమా షూటింగ్ సందడి బుధవారం ప్రారంభమైంది. నాని డైరెక్షన్‌లో ఎస్ఆర్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్-1 సినిమా షూటింగ్ జరిగింది. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి స్టేడియంలో తొలిషాట్‌ను నూతన హీరో, హీరోయిన్లు వై. శశికుమార్‌రెడ్డి, శిరీషారెడ్డిలపై క్లాప్ కొట్టి ప్రారంభించారు. ముందుగా నిర్మాతలు రవి, నారాయణలతో పాటు చిత్ర యూనిట్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాతలు రవి, నారాయణ మాట్లాడుతూ డైరెక్టర్ రవి ప్రముఖ సీనియర్ డైరెక్టర్ల వద్ద పని చేసిన అనుభవం ఉందన్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా అని కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమాగా రూపొందుతుందన్నారు. డైరెక్టర్ నానికి ఇది రెండో సినిమా అన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా పాల్గొన్న 26వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఎస్.ఉహజాహ్నవి, మీనా మహిత పాల్గొనడం కళాశాలకు అరుదైన గౌరవం దక్కిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ 26వ నేషనల్ యూత్ ఫెస్టివల్ కార్యక్రమం ఈ నెల 12 నుంచి 16 వరకు భారతదేశ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కర్నాటక రాష్ట్రం హుబ్లీలోని ధార్వాడ్‌లో జరిగాయన్నారు. ఈ యూత్ ఫెస్టివల్‌కు మన రాష్ట్రం నుంచి 12 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేయగా వారిలో ఇద్దరు ఎల్బీఆర్‌సీఈ నుంచి పాల్గొనడం కళాశాలకు గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, డీన్స్, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరిప్రసాద్ తదితరులు అభినందించారు.

రహదారులకు మోక్షం

- అత్యవసర రోడ్లకు మరమ్మతులు
- రూ.59 కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదన
- రూ.25 కోట్లతో వంతెన పునర్నిర్మాణానికి అంచనా



తిరువూరులో అత్యవసర మరమ్మతులు పూర్తయిన ప్రధాన రహదారి

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో దీర్ఘకాలంగా నిర్లక్ష్యానికి గురవుతున్న పలు ప్రధాన రహదారుల పునర్నిర్మాణానికి రహదారులు, భవనాల శాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు. తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, ఏ.కొండూరు మండలాల్లోని 12 రహదారులను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయడానికి రూ.43 కోట్లతో ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు త్వరలోనే ఆమోదం పొందనున్నట్లు అధికారులు తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు..

రూ.50 లక్షలతో అడసర్లపాడు-తిరువూరు, ఎస్‌పీ రోడ్-ఎర్రమాడు, ఊటుకూరు-ఆత్కూరు, మారేపల్లి-కోడూరు, తెల్లదేవరపల్లి-వీఎల్‌రోడ్, ఎస్‌పీ రోడ్లకు అత్యవసర మరమ్మతులు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

రూ.25 కోట్లతో వంతెన పునర్నిర్మాణానికి ప్రతిపాదన..

ఐదు సంవత్సరాల క్రితం వరదలకు కొట్టుకుపోయిన గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై వంతెన పునర్నిర్మాణానికి ఆర్ అండ్ బీ అధికారులు రూ.25 కోట్ల అంచనాతో ప్రతిపాదన పంపారు. ఎన్‌డీబీ నిధులతో ఈ వంతెన నిర్మాణం జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తిరువూరు మండలంలో గతంలో అధిక వర్షాలు, వరదల కారణంగా ధ్వంసమైన అక్కపాలెం-తిరువూరు, అడసర్లపాడు-తిరువూరు, ఊటుకూరు-ఆత్కూరు, కోటపాడు-కాకర్ల, టీటీ రోడ్-తునికిపాడు, ఎస్‌పీ రోడ్-ఎర్రమాడు ఆర్ అండ్ బీ రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి రూ.16 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

మరమ్మతులు చేస్తున్నాం..

తిరువూరు సబ్ డివిజన్లో రాకపోకలకు ఇబ్బందికరంగా ధ్వంసమైన రహదారులను అత్యవసర నిధులు, నిర్వహణ గ్రాంట్లతో మరమ్మతులు చేస్తున్నాం. వరదలకు కొట్టుకుపోయిన వంతెనలు, రహదారుల పునర్నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

-రోజాకుమారి, డీఈ, ఆర్ అండ్ బీ, తిరువూరు

ఈ క్రాప్ నమోదు చేయించండి



వీఏఏల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రాజ్యలక్ష్మి

విస్సన్నపేట: మండలంలో రైతులు వేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులకు స్థానిక ఏవో కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. రబీ 2022-23వ సంవత్సరానికి సంబంధించి రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ పంట నమోదు తప్పక చేయించాలని సూచించారు. పీఎంకిసాన్‌లో నమోదు కాని రైతులకుఈ కేవైసీకాని రైతులకు అవగాహన కల్పించాలని ఏవో పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన పెంచాలి

మునునూరు: సచివాలయ సిబ్బంది అన్నివేళలా అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను ప్రజలందరికీ వివరించాలని ఎంపీడీఓ జి.రాణి ఆదేశించారు. మండలంలోని గోపవరం, గుళ్లపూడి గ్రామ సచివాలయాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలను వేగంగా పూర్తి చేయాలన్నారు. పథకాల వ్యాప్తి అమలులో నిర్లక్ష్యాన్ని, అనుమతిలేని గైర్హాజరీని, అధికార దుర్వినియోగాన్ని ఎట్టి పరిస్థితిలోనూ సహించబోమని హెచ్చరించారు. సర్పంచ్ ఆర్.శ్రీదేవి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, వైఎస్సార్ సీపీ నేత కొల్లి సాంబశివరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

అకౌంటెంట్‌పై వచ్చిన ఫిర్యాదులపై విచారణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వాస్పత్రి అకౌంటెంట్ కేవీ ప్రసాద్‌పై వచ్చిన ఫిర్యాదులపై బుధవారం విచారణ చేపట్టారు. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేస్తున్న పలువురు మహిళలు ఇచ్చిన ఫిర్యాదుతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బీ సౌభాగ్యలక్ష్మి విచారణకు ఆదేశించారు. ఐదుగురు సభ్యులను విచారణ కమిటీలో నియమించారు.కమిటీ సభ్యులు అప్తమాలజీ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి, సైకియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ కట్టా శ్రీనివాసరావు,అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జ్వలిత, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యు.శోభ విచారణ చేపట్టారు.అడ్మినిస్ట్రేషన్‌కార్యాలయంలోపనిచేస్తున్న మహిళా ఉద్యోగినితో పాటు, అకౌంటెంట్ వేధించిన సీనియర్ అసిస్టెంట్ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పలువురిపై తప్పుడు ఫిర్యాదులు పెట్టి, బెదిరింపులకుపాల్పడుతున్న విషయాలనువిచారణలో తెలియజేసినట్లు సమాచారం.

దుమ్మాకొట్టిన అకౌంటెంట్

అకౌంటెంట్‌పై వచ్చిన ఆరోపణలపై బుధవారం విచారణ చేపట్టనున్నట్లు ముందుగానే సమాచారం ఇచ్చినప్పటికీ కమిటీ ముందు హాజరు కాకుండా సెలవుపెట్టినట్లు తెలిసింది. విచారణకు హాజరు కాకూడదనే సెలవుపై వెళ్లినట్లు సమాచారం. దీంతో విచారణ అధికారులు తాము బాధితుల నుంచి సేకరించిన అంశాలపై నివేదిక రూపంలో సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మికి అందజేశారు. ఆమె తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రకటన

ఎన్.టి.ఆర్. జిల్లా, తిరువూరు నగర పంచాయితీ వాస్తవ్యులైన దోసపాటి వెంకటేశ్వరరావు గారి కుమారుడు దోసపాటి ప్రదీప్ గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా

దిగువ చూపబడినటువంటి షెడ్యూలు దాఖలా ఆస్థి తిరువూరు వాస్తవ్యులైన నాళ్ళా పెద్దబ్రహ్మం గారు మరియు చిన్నబ్రహ్మం గారు విభజించుకోగా, పెద్దబ్రహ్మం గారికి వచ్చిన వాటాలోని నివాస స్థలము, అందు గల ఆర్.సి.సి. డాబాలు వగైరాలు ఆయన వారసులైన 1) నాళ్ళా పెద్దబ్రహ్మం అనే బ్రహ్మం గారి భార్య నాళ్ళా కస్తూరి, 2) నాళ్ళా భరణి, 3) నాళ్ళా సురేంద్ర, 4) నాళ్ళా కాశీ, 5) నాళ్ళా విజయ కుమార్‌లు కలసి విక్రయించుటకు అంగీకరించి యున్నందున సదరు షెడ్యూలును నా క్లయింటు ది. 08.02.2023 తారీఖులోపు రిజిష్టరు చేసుకొనుటకు అంగీకరించినారు. కావున సదరు ఆస్థిపై ఎవరికైనా, ఎటువంటి అభ్యంతరములు గానీ, హక్కులుగానీ, క్లయిములుగానీ, తనఖాలు గానీ మరియు కోర్టు ఆర్డర్లుగానీ, ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోపు లిఖిత పూర్వకముగా నా క్లయింటుకు గానీ, లేదా దిగువ తెలిపిన అడ్రస్సుకుగానీ తెలియ పరచవలెను. సదరు తారీఖు తదుపరి వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు.

షెడ్యూలు: ఎన్.టి.ఆర్. జిల్లా, తిరువూరు సబ్ డివిజన్ తిరువూరు మండలం, తిరువూరు నగర పంచాయితీ యిలాకా, నడిం తిరువూరు రెవిన్యూ గ్రామములోని మా కున్నటువంటి ఆర్.యస్. నెం. 183/1 దాఖలా య. 0.11 సెంట్లకు అయిన 532.4 చ.గ.లకు సరియైన 445.086 చ.మీ.ల నివేశన స్థలం అందుగల తిరువూరు నగర పంచాయితీ వారి ప్రస్తుతం అమలులో ఉండి మాలో 1వ వారి పేరుతో నమోదు కాబడినటువంటి 6-177 డోరు నెంబరున్నూ, 1146003137 అసెస్మెంటు నెంబరుతో (బోసు బొమ్మ సెంటర్) గల గ్రౌండ్ ఫ్లోరు మాత్రమే నిర్మితమైన డాబాను, షాపులు వగైరాలుగల నివేశన స్థలము నకు హద్దులు. తూర్పు: విజయవాడ టు భద్రాచలం ఆర్ అండ్ బి రోడ్డు, దక్షిణం: నగర పంచాయితీ రోడ్డు, పడమర: షేక్ వలీ అహ్మద్ గారి గోడౌన్, ఉత్తరం: నాళ్ళా (లేటు) కృష్ణా రావు గారి వారసులు కలిసి డాక్టర్ బానోతు రమేష్ గారికి విక్రయించిన ప్రహరీగోడ 85 అడుగుల 6 అంగుళములు తదుపరి మాకున్నూ డాక్టర్ బానోతు రమేష్ గారికి చెందిన జాయింటు గోడ 30 అడుగులు.

ఈ హద్దుల మధ్యస్థమైన సదరు 532.4 చ.గ.లకు సరియైన 445.086 చ.మీ.ల నివేశన స్థలమున్నూ అందుగల తిరువూరు నగర పంచాయితీ వారి ప్రస్తుతం అమములులో ఉన్న 6-177 డోరు నెంబరున్నూ, 1146003137 అసెస్మెంటు నెంబరుతో (బోసు బొమ్మ సెంటర్) గల గ్రౌండ్ ఫ్లోరు మాత్రమే నిర్మితమైన డాబాలకు అమర్చిన యావద్విశిష్టమైన కలప, సదరు స్థలములో గల బాత్రూం, లెట్రిన్, బోరు, మోటారు, మంచి నీటి కుళాయి, 6622200006913, 6622200004179, 6622200004177, 6622200004178, 6622200003303, 6622200001054, 6622200004180 నెంబరుల గల కరెంటు సర్వీసులు, వగైరాల స్థిరాస్తిని విక్రయించుటకు అంగీకరించి యున్నారు.

నా క్లయింటు చిరునామా: దోసపాటి ప్రదీప్ S/o. దోసపాటి వెంకటేశ్వరరావు, డోరు నెం. 11-86-1, బెండెడ బజారు, పాత పోస్టాఫీస్ దగ్గర, తిరువూరు - 521 235, సెల్: 9441864981.

ఇట్లు: పి. శేషుమోహన్, డి. చంద్రశేఖరరావు, అడ్వకేట్స్ గోపువారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-520 002. సెల్: 9848282996.